క్లుప్తంగా

గిడ్డాంజనేయస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో గిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయ స్వామికి గురువారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు, గ్రామస్తులు విశేష పూజలు జరిపించారు. ఉదయాన్నే స్వామివారికి వేద పండితులు అభిషేకాలు నిర్వహించడంతో పాటు, ఆకుల పూజ నిర్వహించారు.

కంది, కొర్ర విత్తనాల మంజూరు

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌కుగాను మండలానికి 5 క్వింటాళ్ల కంది, 5 క్వింటాళ్ల కొర్ర విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ గురువారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద ఎక్కువ మంది రైతులు కొర్రలు సాగు చేస్తున్న దృష్ట్యా మరిన్ని కొర్ర విత్తనాల మంజూరుకై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఏఓ పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తల సంబరాలు


గౌరు చరితారెడ్డి, వెంకటరెడ్డి దంపతులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన గౌరు చరితారెడ్డిని గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.గజమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, పెరుగు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకా వేయించుకోవాలి


వృద్ధురాలికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: అరవై ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ బీసీజీ టీకా వేయించుకోవాలని మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్ సూచించారు. పాణ్యం మడలంలోని మద్దూర్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో గురువారం వృద్ధులకు వైద్య సిబ్బంది బీసీజీ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కరోజే 185మందికి బీసీజీ వ్యాక్సిన్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 89 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 89 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,542 మందికి గానూ 1,373 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షలకు 417 మందికి గానూ 381 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2, కర్నూలు డిగ్రీ కళాశాల, సాయికృష్ణ డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, బేతంచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఆరుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

బాబూ.. ఇండియా కూటమిలోకి రండి

కర్నూలు(సెంట్రల్): ఏపీకి ప్రత్యేక హోదా కోసం చంద్రబాబునాయుడు ఇండియా కూటమిలో చేరాలని, లేదంటే మోదీని ఒప్పించి తీసుకు రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జి.రాంపుల్లయ్య యాదవ్ కోరారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలను అమలు చేసి, మంచి పాలన అందించాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల, వేదవతి రిజర్వాయర్లను పూర్తి చేయాలన్నారు. కర్నూలు పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి 70 వేల ఓట్లు పడ్డాయని, ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగుప్తా మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు నరసింహులు యాదవ్, ప్రదీప్‌వెంకటేష్ యాదవ్, లోకనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఓట్లు వేసిన వారందరికీ కృతజ్ఞతలు
- టీడీపీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు


మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, చిత్రంలో ఆదిమూలపు సతీష్ తదితరులు

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని ఏ క్యాంపులో ఉన్న సతీష్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోడుమూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన బి.దస్తగిరికి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీకి వారు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి అమలు చేసిందని గుర్తు చేశారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు విశ్వసించి ఓట్లు వేశారని, ఆ విశ్వసనీయతను తెలుగుదేశం పార్టీ నిలబెట్టుకోవాలన్నారు. తమకు ఎన్నికల్లో 80 వేల మందికిపైగా ఓట్లు వేశారని, ఓ 20 వేల మంది ఓటర్లను మెప్పించలేకపోయామని, భవిష్యత్తులో వారి అభిమానాన్ని చూరగొంటామన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఏ సమయంలోనైన ప్రజలు తమ ఇద్దరిని సంప్రదించవచ్చునని అన్నారు. నాలుగు మండలాలల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్ రెడ్డి, ప్రసన్నకుమార్, కార్పొరేటర్ విక్రం సింహారెడ్డి, వైస్ ఎంపీపీ నెహెమియా, ఉల్చాల వాసు, గుడూరు నగర పంచాయతీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం, చిన్న లక్ష్మన్న, మండల కన్వీనర్లు మహబూబ్ బాషా, రమేష్ నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చిన్న లక్ష్మన్న, గార్గేయపురం సురేష్, కౌన్సిలర్ మద్దిలేటి, సర్పంచులు పాండు రంగన్న, శ్రీనివాసరెడ్డి, ఎస్.ఎం బాషా, గుడిపాడు లక్ష్మీకాంత రెడ్డి, లింగమయ్య, ఏసేపు, ఆదాము, వెంకటేష్, అనిల్, బాష, అహ్మద్ అలీ, భాస్కర్, ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

యువ రైతు ఆత్మహత్య


వడ్డె బజారి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బోడబండ గ్రామానికి చెందిన యువ రైతు వడ్డె బజారి (32) అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బోడబండ గ్రామానికి చెందిన వడ్డె బజారికి భార్య సరస్వతి, కుమార్తెలు రేణుక, అనుపమ, కుమారుడు మహేష్ ఉన్నారు. సొంతంగా ఏడెకరాల పొలం ఉండగా మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. అప్పులు చేసి పొలంలో రెండు బోర్లు వేయించి మిరప పంటను సాగుచేశాడు. పంట నష్టం రావడంతో అప్పులే మిగిలాయి. అప్పులు రూ.10 లక్షలకు చేరాయి. తిరిగి చెల్లించాలని ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలో భార్య పిల్లలతో కలిసి పుట్టినిల్లు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కరుగోడు గ్రామానికి వెళ్లింది. రెండు రోజుల క్రితం భార్య దగ్గరకు వెళ్లి మాట్లాడి బయటకు వచ్చి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గురువారం స్వగ్రామం బోడబండకు తీసుకొచ్చారు. ఇంటి పెద్ద అప్పుల బాధతో మృతి చెందడంతో కుటుంబ రోడ్డున పడింది. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కర్నాటక పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

మారెమ్మ ఆలయంలో చోరీ



కౌతాళం: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయంలో గురువారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. మారెమ్మ అవ్వకు భక్తులు సమర్పించిన బంగారు అభరణాలను దుండగులు దొంగలించుకుని వెళ్లారు. మంగళసూత్రాలు, పూర్డిలను దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందన్నారు. తెల్లవారితే అమావాస్య ఉండడం ఇదే రోజు అమ్మవారి బంగారు అభరణాలు దొంగతనం జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు పూర్తి విచారణ జరిపి దొంగలను పట్టుకుని బంగారు అభరణాలను రికవరీ చేయాలని వారు కోరుతున్నారు.

11న వాహనాల వేలం

పత్తికొండ రూరల్ : అక్రమ మద్యం, నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాల బహిరంగ వేలం ఈ నెల 11వ తేదీన పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో నిర్వహిస్తామని సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలంలో వాహనాలు దక్కించుకోని వారికి డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లిస్తామని చెప్పారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి


జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): చెన్నై-సూరత్ జాతీయ రహదారి కోసం భూములు కోల్పోయిన అసైన్‌మెంట్‌దారులకు తక్షణమే పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీరైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు మండలం ఉల్చాల, బసాపురం గ్రామాలకు చెందిన రైతులు తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ జేసీ నారపురెడ్డి మౌర్యను ఆమె కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..సారవంతమైన భూములకు తక్కువ పరిహారం ఇస్తుండడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. రైతుల దగ్గర భూ హక్కుపత్రాలు ఉన్నప్పటికీ అధికారులు పరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మండల కార్యదర్శి జి.ఆంజనేయులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, తాండ్రపాడు సర్పంచ్ బాలపీర పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని ప్రారంభించాలి

కర్నూలు కల్చరల్: నూతన ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రారంభించాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షులు మహేష్ దేగల ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యార్థులపై బలవంతంగా ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దడంతో ఎంతో మంది విద్యార్థులు చదువులో వెనబడ్డారన్నారు. మాతృ భాషలో చదువుకోవడం ఉత్తమమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (టౌన్): ఈనెల 29న బక్రీద్ పండుగ రోజు వ్యర్థాల సేకరణకు నగరపాలక సంస్థకు పాలీ ప్రొపెలీన్ బ్యాగుల సరఫరా చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 వేల బ్యాగులను సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. సరఫరా చేయదలచుకున్న కాంట్రాక్టర్లు పని వేళల్లో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమితో ఆగిన కార్యకర్త గుండె


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్

గూడూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో పట్టణానికి చెందిన ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అంజి తండ్రి, కార్యకర్త తెలుగు లక్ష్మన్న (55) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. గత రెండు రోజులుగా తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మన్న బుధవారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. కుంటుంబీకులు ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. కుంటుంబీకుల రోదనతో తీవ్ర విషాదం అలముకుంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హర్షవర్దన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, మాజీ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, జే.ఆబేల్, కౌన్సిలర్లు కళాం, దస్తగిరి, కుమార్, మద్దిలేటి, తదితరులు నివాళులర్పించారు.

క్రీడల్లో రాణించాలి


మెలకువలు నేర్పిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్): నిత్య సాధనతో క్రీడల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్ బాల్ క్రీడాంశంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని విజిలెన్స్ సీఐ సునీల్‌తో కలిసి పరిశీలించారు. క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూలు నగరపాలక సంస్థ సౌజన్యంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి శిబిరాల్లో క్రీడాకారులు క్రీడల్లో మెళకువలు నేర్చుకోవాలన్నారు.

జీలుగలు పంపిణీ

పాణ్యం: మండలానికి 67 క్వింటాళ్ల జీలుగలు, 4 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరయ్యాయని ఏఓ జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు జీలుగలు, పిల్లిపెసర పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

దిన్నెదేవరపాడులో కార్యకర్త మృతి


గోపాలకృష్ణ (ఫైల్)

కర్నూలు సిటీ: మండల పరిధిలోని దిన్నెదేవరపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, దేవమ్మ దంపతుల కుమారుడు గోపాలకృష్ణ (38) వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక గుండె పోటుకు గురై మృతిచెందాడు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గోపాలకృష్ణ వీరాభిమాని. తన అభిమాన నాయకుడు వైఎస్ జగన్ ఎన్నికల కౌంటింగ్ తరువాత బాధతో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతుండటం చూసి తట్టుకోలేకపోయాడు. తీవ్ర ఆవేదన గురై కుటుంబ సభ్యులతోనూ, స్నేహితులతోనూ చెప్పి బాధ పడేవాడు. ఈక్రమంలో బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా కోలుకోలేక గురువారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ రామనాథ్ రెడ్డి హాస్పిటల్‌కు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృత్యుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

విత్తనాలను అధిక ధరకు అమ్మితే చర్యలు


సి.బెళగల్‌లో విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులకు విత్తనాలను ఎంఆర్‌పీ కన్నా అధిక ధరకు అమ్మితే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. ఆయన గురువారం మండలంలోని సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో పర్యటించి పలు విత్తన దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్తి, కందులు, సజ్జ, మిరప విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం దుకాణ డీలర్లతో మాట్లాడుతూ.. విత్తనాలను ఎంఆర్‌పీకే అమ్మాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అనుమతులున్న, నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. తనిఖీలో భాగంగా ఏఈ బీటీ పత్తి విత్తనాలలో హెర్బిసైడ్ టోలరెంట్ (హెచ్‌టీ - కలుపు సంహారకాలను తట్టుకునేది) పరీక్షలను నిర్వహించారు. బీటీ పత్తి విత్తనాలకు హెచ్‌టీ పరీక్షలను నిర్వహించగా, అన్ని పరీక్షల ఫలితాలలో నెగెటివ్ రిపోర్టు వచ్చినట్లు ఏఓ తెలిపారు. పత్తి విత్తన పరీక్ష ఫలితాలను, నాణ్యతను స్థానికంగా ఉన్న రైతులకు వివరించి, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా విత్తన శ్యాంపిళ్లను పరీక్షల నిమిత్తం గుంటూరు ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆయన తెలియజేశారు. వ్యవసాయ సహాయకులు, ఎంఈఓలు ఉన్నారు.

వర్షపు నీటిలో ఇరుక్కుపోయిన వాహనదారులు

- కాపాడిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

కర్నూలు: మండలంలోని గార్గేయపురం చెరువు వద్ద రోడ్డుపై పారుతున్న వర్షపు నీటిలో వాహనదారులు ఇరుక్కుపోయి రెండు గంటల పాటు భయంభయంగా కాలం గడిపారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన గడ్డం సాగర్ కర్నూలుకు వచ్చి తిరిగి అర్ధరాత్రి ఊరికి వెళ్తుండగా భారీ వర్షం కారణంగా గార్గేయపురం చెరువు వద్ద రోడ్డుపై నీరు పారుతుండగా దాటేందుకు కారును అందులో దింపాడు. నీటి ఉధృతికి కారు రోడ్డు సైడుకు కొట్టుకుపోవడంతో ఆందోళనకు గురై కారుపైకి ఎక్కి కాపాడండి.. అంటూ కేకలు వేశాడు. అదే సమయంలో కర్నూలు నుంచి నందికొట్కూరుకు 11 మంది ప్రయాణికులతో ఆటో వెళ్తూ కారుపై ఉన్న వ్యక్తిని కాపాడేందుకు ప్రయత్నించగా వారు కూడా నీటి ఉధృతికి ఇరుక్కుపోయారు. దాదాపు రెండు గంటల పాటు బయటకు రాలేక వాహనాల్లోనే కాలం గడిపారు. సమీపంలోని గ్రామస్తులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని తాడు సాయంతో కాపాడారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకుని అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. గురువారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పు స్వామివారిని దర్శంచుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. బుధవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమావాస్య వేడుకల్లో పాల్గొనడంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులను విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ మార్గాల్లో దర్శనానికి పంపారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో కూడా భక్తులు గంటకుపైగా వేచిఉండి స్వామివారి దర్శనం చేసుకున్నారు. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని కంట్రోల్ చేయడంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది సహకరించారు.

బ్రిడ్జికి పొంచివున్న ప్రమాదం !


తొగర్చేడు వద్ద కుందూనది బ్రిడ్జికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క

పాణ్యం: కుందూనదికి వరదనీటి ప్రవాహం పెరగడంతో నదిపై ఉన్న గర్రపుడెక్క ఆకు బ్రిడ్జికి అడ్డ పడడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామం ముందు ఉన్న కుందూనదిపై ఉన్న బ్రిడ్జికి భారీగా గుర్ర పుడెక్క ఆకు కొట్టుకువచ్చింది. దీనికి తోడు వరదనీరు క్రమంగా పెరుగుతుండడంతో ప్రజలు భయాందళనకు గురవుతున్నారు. ఆకును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. బ్రిడ్జికి ఆకు అడ్డు పడడంతో కోతకు గురవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే చాలా వరకు కోతకు గురైందని, అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు


పోలకల్‌లో బందోబస్త్ నిర్వహిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలుగజేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో పర్యటించారు. ఎన్నికల ఫలితాల అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ముడుమాల, పోలకల్ తదితర గ్రామాల్లో ఎస్ఐ పర్యటించి, అక్కడి పరిస్థితులు, బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎలాంటి ఘర్షణ పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

నీటి ముంపు కాలనీలో ఎమ్మెల్యే పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు సిటీ: నీటి ముంపు కాలనీలలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం పర్యటించారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గార్గేయపురం చెరువు నిండి నందనపల్లె గ్రామ పంచాయతీ లక్ష్మీనగర్‌లోని ఇళ్లలోకి చేరింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కాలనీలో పర్యటించారు. భవిష్యత్తులో నీటి ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

విద్యా కానుక కిట్లను సకాలంలో చేరవేయండి

- సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ జ్యోతి విజయకుమారి


పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఏపీసీ విజయకుమారి

ఓర్వకల్లు: ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కానుక కిట్లను పాఠశాలలు తెరిచే సమయానికి సకాలంలో చేరవేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోతి విజయకుమారి అన్నారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీలో భద్రపరచిన విద్యా కానుక కిట్లను విజయకుమారితో పాటు, సీఎంఓ అల్లబకాష్ కలిసి తనిఖీ చేశారు. మొదటి విడతలో మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగులు, బెల్టుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి 37,869 పాఠ్యపుస్తకాలు, 45,520 నోటు బుక్స్, 6782 స్కూలు బ్యాగులు, 4830 బెల్టులు వచ్చాయని ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ ఆమెకు వివరించారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నాటికి విద్యా కానుక కిట్లను విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారలను ఆదేశించారు. ముందుగా తరగతుల వారీగా సీనియర్ విద్యార్థులకు పంపిణీ చేయాలని, ఆ తర్వాత కొత్త విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, మండల విద్యా శాఖాధికారి ఓంకార్ యాదవ్, సిఆర్‌పీలు మల్లికార్జున, నాగమద్దయ్య, ఎల్లయ్య, మంగమ్మ, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రీ


పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

పొంగిన వాగులు, వంకలు

మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. హంద్రీ నది పొంగిపొర్లింది. పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– కల్లూరు